క్లుప్తంగా...

కల్లుగీత విభాగం సంయుక్త కార్యదర్శిగా భాస్కర్ గౌడ్



నియమాక పత్రాన్ని అందుకుంటున్న ముద్దగౌని భాస్కర్ గౌడ్

రాజేంద్రనగర్: రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ కల్లుగీత విభాగం సంయుక్త కార్యదర్శిగా రాజేంద్రనగర్ సర్కిల్ అత్తాపూర్‌కు చెందిన ముద్దగౌని భాస్కర్ గౌడ్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర కల్లుగీత విభాగం చైర్మన్ కె.నాగరాజు గౌడ్ గురువారం భాస్కర్ గౌడ్‌కు నియమాక పత్రాన్ని అందజేశారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కల్లుగీత విభాగం కమిటీని మొదటిసారిగా ఏర్పాటు చేసిందన్నారు. రాష్ట్రంలో కల్లుగీత కార్మికుల సంక్షేమం కోసం కమిటీని రాష్ట్ర పార్టీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారన్నారు. చైర్మన్‌గా నాగరాజు గౌడ్ ఆధ్వర్యంలో పూర్తిస్థాయి కమిటీని ఎన్నుకుంటున్నారన్నారు.

ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు



కిస్మత్‌పూర్‌లో పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ తదితరులు

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కిస్మత్‌పూర్‌లో దుర్గామాత ఆలయంలో దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. కార్పొరేటర్ గోకరి శ్రీలతసురేష్‌గౌడ్ నిర్వహించిన దుర్గామాత పూజల్లో రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు.

ఇన్ఫినిటీ డ్రైవ్ ఇన్ యజమానిపై చీటింగ్ కేసు నమోదు

గచ్చిబౌలి: ఇన్ఫినిటీ డ్రైవ్ ఇన్ యజమాని వెలగపూడి రఘు తేజపై వేర్వేరుగా రెండు చీటింగ్, బెదిరింపుల కేసులు గచ్చిబౌలి పీఎస్‌లో నమోదయ్యాయి. సీఐ జేమ్స్ బాబు తెలిపిన వివరాలిలా.. గచ్చిబౌలిలోని ఎఫ్‌సీఐ కోఆపరేటివ్ సొసైటీలో తేజ జీహెచ్‌ఎంసీ అనుమతులు లేకుండా భారీ ఇన్ఫినిటీ డ్రైవ్ ఇన్ ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. సంవత్సరం క్రితం అనుమతులు లేకపోవడంతో జీహెచ్‌ఎంసీ అధికారులు ఇన్ఫినిటీ డ్రైవ్ ఇన్‌ను నేలమట్టం చేసిన విషయం తెలిసిందే. వచ్చిన లాభంలో 5 శాతం ఇస్తానని చెప్పడంతో ఇనిఫ్నిటీ డ్రైవ్ ఇన్ నిర్మాణ సమయంలో 2021లో గచ్చిబౌలిలో నివాసం ఉండె ఠాకూర్ ప్రసాద్ రూ.75 లక్షలు ఇచ్చాడు. ఇచ్చిన డబ్బు అడగగా రూ.10 లక్షలు తిరిగి ఇచ్చారు. కళ్యాణ్ చక్రవర్తి అనే వ్యక్తి రూ.10 లక్షలు అడ్వాన్స్‌గా ఇచ్చానని వేర్వేరుగా ఫిర్యాదు చేశారు. రఘు తేజ, అతని తండ్రి వెలగపూడి శ్రీనివాస్‌పై ఐపీసీ 406,420,506 సెక్షన్ల కింద కేసు నమోదు చేశామని సీఐ జేమ్స్ బాబు తెలిపారు.

నవంబరులో.. సన్‌బర్న్..

సాక్షి, సిటీబ్యూరో: ఎలక్ట్రానిక్ డ్యాన్స్ మ్యూజిక్‌కి ప్రపంచ ప్రసిద్ధి చెందిన సన్ బర్న్ మ్యూజిక్ ఫెస్టివల్ నగరంలో మళ్లీ సందడి చేయనుంది. ఈ విషయాన్ని సహ నిర్వాహక సంస్థ అబ్జల్యూట్ గ్లాస్‌వేర్ ప్రతినిధులు ఓ ప్రకటనలో తెలిపారు. ఈసారి 6 గురు గ్లోబల్ ఆర్టిస్టులు, ఇంటర్నేషనల్ డీజేలు పాల్గొనే ఈ ఈవెంట్ నవంబరులో నగరానికి రానుంది. దేశవ్యాప్తంగా పలు నగరాల్లో 24 ప్రదర్శనలు నిర్వహిస్తున్నామని, చివరగా ఫైనల్ ఈవెంట్, ప్రపంచ సంగీతాభిమానుల్ని పెద్ద సంఖ్యలో ఆకర్షించే గోవాలో డిసెంబర్ 28 నుండి 31 వరకు జరుగుతుందన్నారు.

21న మాతా రాణికా విశాల్ జాగరణ్

జియాగూడ: ఈనెల 21న ధూల్‌పేట్ నవరాత్రి ఉత్సవ సమితి హైదరాబాద్ ఆధ్వర్యంలో రహింపురాలోని అంబేడ్కర్ భవన్ ప్లేగ్రౌండ్‌లో మాతా రాణికా విశాల్ జాగరణ్ పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నట్లు సమితి చైర్మన్ ఎం.శ్రీధర్‌బాబు, అధ్యక్షుడు టి.జితేందర్ సింగ్, ప్రధాన ఆర్యదర్శి పిట్టల కృష్ణ, కోశాధికారి నిర్మేష్, సలహాదారులు ఎం.మహేష్, పి.రవీందర్‌సింగ్, టి.విపిన్‌రాజ్ సింగ్, వైస్ చైర్మన్ కె.సత్యనారాయణలు తెలిపారు. గురువారం జాగరణ బ్రోచర్‌ను రహింపురాలో విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ..మాశక్తి యువ మండల్ భాగ్యనగర్ ద్వారా భజనమండలి ఉంటుందన్నారు. జాగరణ్‌లో వివిధ దేవతామూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం జాగరణ్ భజనలు కొనసాగుతాయని ఇందులో ప్రముఖ గాయకులు ఠాకూర్ రవిసింగ్, కోమల్ తివారి, ఎస్.రాజన్ కుమార్, మౌంటీ నట్రాజన్ బృంద ఢిల్లీ వారితో వివిధ దేవతామూర్తుల వేషధారణలతో నృత్యాలు ఉంటాయన్నారు.

ఈ సేవ లేదు..!

- రెండు నెలలుగా ఈసేవ కేంద్రం బంద్
- సీలింగ్ కూలితే ఈ సేవను మూసివేస్తారా అంటున్న ప్రజలు



ఈ సేవ కేంద్రం వద్ద బీజేపీ నేతలు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్‌లోని ఈ సేవ కేంద్రం రెండు నెలలుగా పనిచేయడం లేదు. సీలింగ్ కూలిపోయిందనే కారణంతో ఈసేవ కేంద్రానికి తాళం వేశారు. సీలింగ్ ఊడిపడితే మరమ్మతులు చేసి సేవలందించాలి కానీ మూసివేయడం ఏమిటని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలో ఈ సేవ కేంద్రాలను ఏర్పాటు చేసిన సమయంలో రాజేంద్రనగర్‌లోని రిజిస్ట్రేషన్ కార్యాలయం పక్కన గల భవనంలో ఈ సేవను ఏర్పాటు చేశారు. రంగారెడ్డి జిల్లాలోని ఇక్కడి ఈ సేవ కేంద్రం మొదటిస్థానంలో నిలిచింది. రాష్ట్ర వ్యాప్తంగా రాజేంద్రనగర్ ఈ సేవకు గుర్తింపు ఉండేది. రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని ప్రజలతో పాటు శంషాబాద్, గండిపేట్, శంకర్‌పల్లి, బండ్లగూడ, బహదూర్‌పురా మండలాలకు చెందిన ప్రజలు ఈ కేంద్రాన్ని ఉపయోగించేవారు. ప్రతిరోజూ వందలాది మంది ఈ కేంద్రానికి వచ్చి తమకు కావాల్సిన సర్టిఫికెట్లు, ఆన్‌లైన్ బిల్లుల చెల్లింపు, ప్రభుత్వ దరఖాస్తు తదితర వాటి సేవలను పొందేవారు. ఇదిలా ఉండగా రెండు నెలల క్రితం కార్యాలయంలోని సీలింగ్ కొంత భాగం కూలిపోయింది. అయితే దానికి మరమ్మతులు నిర్వహించాల్సిన అధికారులు ఈ సేవ గురించే మరచిపోయారు. సీలింగ్ కూలిపోవడంతో కాంట్రాక్ట్ సూపర్‌వైజర్ కార్యాలయానికి తాళం వేసి మూసివేశారు. దీంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఈ సేవ కేంద్రం రేతిబౌలి ప్రాంతంలో ఉందని.. అక్కడి వెళ్లి సేవలు పొందాలని సంబంధిత సూపర్‌వైజర్ తెలుపుతున్నాడని పలువురు ఆరోపించారు. ప్రజల సౌకర్యార్థం ఈ సేవ కేంద్రాన్ని తెరవాలని పలువురు కోరుతున్నారు.

ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు

ఈసేవ కేంద్రాన్ని తెరవాలని రంగారెడ్డి జిల్లా అధికారులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని రాజేంద్రనగర్ డివిజన్ బీజేపీ పార్టీ అధ్యక్షులు బాబూరావు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇప్పటికైనా ఈ సేవను వెంటనే పునరుద్ధరించాలని... లేకపోతే జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు.

డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో ఏర్పాట్లు పూర్తి చేయండి



ఎన్‌సీసీ గ్రౌండ్‌లోని డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను పరిశీలిస్తున్న భారతి హోలీకేరి

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఎన్‌సీసీ గ్రౌండ్ ఆవరణలోని డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను గురువారం రంగారెడ్డి జిల్లా కలెక్టర్ భారతి హోలీకేరి సందర్శించారు. ఇక్కడి నుంచి రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని పోలింగ్ బూత్‌లకు ఎన్నికల సామగ్రిని పంపించనున్నారు. 535 పోలింగ్ కేంద్రాలకు సిబ్బందితో పాటు ఈవీఎంలు, ఇతర సామాగ్రిని పోలింగ్ బూత్‌లకు చేరవేయనున్నారు. ఇక్కడి వసతులను పరిశీలించేందుకు కలెక్టర్ రాజేంద్రనగర్ డీసీపీ జగదీశ్వర్ రెడ్డి, ఏసీపీ గంగాధర్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు, సలహాలు చేశారు. డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలని ఆదేశించారు. అనంతరం యూనివర్సిటీ కార్యాలయంలోని పోలింగ్ బూత్‌లను పరిశీలించారు. పోలింగ్ బూత్‌లలో విద్యుత్, మంచినీటి వ్యవస్థ, మూత్రశాలలు, ర్యాంప్ తదితర వాటన్నింటిని పరిశీలించారు. యూనివర్సిటీలో దాదాపు 4 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. పోలింగ్ బూత్‌లను పరిశీలించిన అనంతరం ఆమె అధికారులతో సమావేశమయ్యారు.

గంజాయి, చరస్ విక్రేతలు అరెస్ట్

- 1.10 కిలోల గంజాయి, 78 గ్రాముల చరస్ స్వాధీనం
- ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ శంషాబాద్ జిల్లా అసిస్టెంట్ సూపరింటెండెంట్ శ్రీనివాస్‌రెడ్డి



సమావేశంలో ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ శంషాబాద్ జిల్లా అధికారులు

హఫీజ్‌పేట్ : గంజాయి, చరస్ ప్యాకెట్లను విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్ట్ చేసిన ఘటన శేరిలింగంపల్లి మండల ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ శంషాబాద్ జిల్లా అసిస్టెంట్ సూపరింటెండెంట్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపిన ప్రకారం వివరాలు...రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన నీలేష్ ఇండోరియా (28), మనీష్ (20)లు గత రెండు సంవత్సరాల క్రితం నగరంలోని ఫతేనగర్‌కు బతుకుదెరువు కోసం వచ్చారు. సులువుగా డబ్బులు సంపాదించాలనే ఆలోచనతో గత ఆరు నెలల నుంచి వివిధ రాష్ట్రాల నుంచి గంజాయి, చరస్‌లను తీసుకువచ్చి ఐటీ కంపెనీలకు చెందిన ఉద్యోగులకు విక్రయిస్తున్నారు. గురువారం నానక్‌రామ్‌గూడ విప్రో జంక్షన్ ప్రాంతాలలో వీరిద్దరు తిరుగుతుండగా ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ డిప్యూటీ కమిషనర్ డేవిడ్ రవికాంత్, శంషాబాద్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ సత్యనారాయణ ఆదేశాల మేరకు డీటీఎఫ్ బృందం వారిద్దరినీ అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి వద్ద 20 గ్రాముల చరస్, 60 గ్రాముల గంజాయి ప్యాకెట్లు దొరికాయన్నారు. విచారణలో ఫతేనగర్‌లోని వారి ఇంట్లో గంజాయి, చరస్‌లు ఉన్నాయని తెలుపడంతో అక్కడకు వెళ్లి తనిఖీలు చేయగా మరో 58 గ్రాముల చరస్, 970 గ్రాముల గంజాయి ప్యాకెట్లు దొరికాయన్నారు. మొత్తం 1.10 కిలోల గంజాయి, 70 గ్రాముల చరస్ ప్యాకెట్లు, ఒక బైక్ స్వాధీనం చేసుకున్నామన్నారు. వీటి విలువ సుమారు రూ.8.5 లక్షలు ఉంటుందని పేర్కొన్నారు. ప్రజలు గంజాయి విక్రేతల పట్ల జాగ్రత్తగా ఉండాలని, ఎక్కడైనా ఎవరైన అమ్మితే వెంటనే తమకు సమాచారం అందించాలని ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ అధికారులు ప్రజలకు సూచించారు. ఈ సమావేశంలో శంషాబాద్ డీటీఎఫ్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్ కుమార్, ఎస్‌ఐ శ్రీకాంత్‌రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

మద్యం మత్తులో వాహనాలు నడిపిన ముగ్గురికి జైలు

మణికొండ: నార్సింగి ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో అతిగా మద్యం తాగి వాహనాలు నడుపుతూ పోలీసులకు చిక్కిన ముగ్గురు వ్యక్తులకు కోర్టు గురువారం జైలు శిక్ష విధించింది. ట్రాఫిక్ సీఐ మధుసూదన్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... పోలీస్‌స్టేషన్ పరిధిలోని నార్సింగి, హైదర్‌షాకోట్ ప్రాంతాలలో తనిఖీలు నిర్వహిస్తుండగా శశిప్రీతం, ఓవైసీ ఖాన్, డి. యాదయ్యలు మద్యం మత్తులో వాహనాలు నడుపుతూ దొరికారు. దాంతో వారిని గురువారం కోర్టు ముందు హాజరు పరచగా శశిప్రీతం, ఓవైసీ ఖాన్‌లకు మూడు రోజులు, డి.యాదయ్యకు రెండు రోజుల జైలు శిక్షను విధించినట్టు ఆయన తెలిపారు.

తనిఖీల్లో రూ. 9.9 లక్షల నగదు పట్టివేత

శంషాబాద్: పట్టణంలో ఆర్‌జీఐఏ పోలీసులు చేపట్టిన తనిఖీల్లో గురువారం రాత్రి రూ.9.9 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన మేరకు.. పట్టణంలోని ఆర్‌బీనగర్ బచ్‌పన్ స్కూల్ సమీపంలో అనుమానాస్పదంగా హోండా యాక్టివా వాహనంపై రాజేంద్రనగర్ సర్కిల్ పద్మశాలిపురం బస్తీకి చెందిన బాస మహేందర్ సంచరిస్తుండడంతో పోలీసులు అతడి వాహనాన్ని తనిఖీ చేశారు. అతడి వద్ద రూ.9.9 లక్షల నగదు ఉండడంతో దానిపై ఆరా తీశారు. డబ్బుకు సంబంధించి చట్టపరంగా ఎలాంటి వివరాలు వెల్లడించకపోవడంతో దానిని స్వాధీనం చేసుకున్నార. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చే స్తున్నారు.

ఇద్దరు వ్యక్తులు అదృశ్యం



అబ్బాస్ (ఫైల్)



అంజయ్య (ఫైల్)

శంషాబాద్ : ఇద్దరు వేర్వేరు వ్యక్తులు అదృశ్యమైన సంఘటన పట్టణంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. పట్టణంలోని మోహిన్ మహల్లాలో నివాసముంటున్న ఖాజాబాయి అలియాస్ అబ్బాస్ ఈ నెల 15న ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటికి వెళ్లాడు. దీంతో కుటుంబసభ్యులు ఆర్‌జీఐఏ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

- ఫరూఖ్‌నగర్ మండలం బుచ్చిగూడెం గ్రామానికి చెందిన మాదే అంజయ్య (58)బుధవారం శంషాబాద్ పట్టణానికి వచ్చి తిరిగి ఇంటికి చేరుకోలేదు. అన్ని చోట్లా వెతికినా ఆచూకి లభించకపోవడంతో కుటుంబసభ్యులు గురువారం రాత్రి ఆర్‌జీఐఏ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్

జంగ్ తెలంగాణ 2023



శంషాబాద్: శంషాబాద్ పట్టణంలోని పోలింగ్ కేంద్రాలను గురువారం జిల్లా కలెక్టర్ భారతి హోలికేరి పరిశీలించారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల, బాలుర ఉన్నత పాఠశాల, కళాశాల భవనాల్లో ఏర్పాటు చేయనున్న కేంద్రాలను ఆమె పరిశీలించి స్థానిక అధికారులకు పలు సూచనలు చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాటు చేయాల్సిన వాటి గురించి తహసీల్దార్ నాగమణి, మున్సిపల్ భోగీశ్వర్లుతో చర్చించారు. గందరగోళం లేకుండాఏర్పాటు సజావుగా పూర్తిగా చేయాలని అధికారులను ఆదేశించారు.

కాంగ్రెస్ పార్టీ రుణం తీర్చుకుందాం



కాంగ్రెస్ పార్టీలో చేరిన వారితో రఘునాథ్‌యాదవ్

శేరిలింగంపల్లి: తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఇచ్చిన సోనియమ్మ రుణం తీర్చుకునేందుకు శేరిలింగంపల్లిలో కాంగ్రెస్‌ను గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు రఘునాథ్‌యాదవ్ కోరారు. భారతీనగర్‌లోని ఓల్డ్ ఎంఐజీకాలనీ, కైలాస్‌నగర్, లింగంపల్లి కాలనీలకు చెందిన పలువురు రాఘవేంద్రకాలనీలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువాలను కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువకులు రాజకీయాల్లోకి రావాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే గాంధీ ఎంఐజీ కాలనీని అసలు పట్టించుకోలేదని విమర్శించారు. అందరికీ అందుబాటులో ఉంటూ ప్రజా సేవే లక్ష్యంగా పనిచేస్తామని స్పష్టం చేశారు. డాక్టర్ కైసర్, మీహార్, ఫాతిమా, సునీల్, సందీప్, గణేష్, చంటి, సమ్మద్, శివ సాంబా, ముజీబ్, డాక్టర్ ముక్తార్, స్వప్న, అనుదీప్, సాదిక్ పాల్గొన్నారు.

నృత్యోత్సవం



మాదాపూర్: శిల్పారామంలో నిర్వహిస్తున్న దసరా, బతుకమ్మ ఉత్సవాల్లో భాగంగా గురువారం సంధ్యారాజు శిష్యబృందం కూచిపూడి నృత్యప్రదర్శనతో అలరించారు.

కార్వాన్ మజ్లిస్ సిట్టింగ్‌కు అధిష్టానం పచ్చజెండా?

గోల్కొండ: మజ్లిస్ అధిష్టానం కార్వాన్ సిట్టింగ్ ఎమ్మెల్యేకు పచ్చజెండా ఊపినట్లు తెలుస్తోంది. 1999 నుంచి కార్వాన్ నియోజకవర్గంలో మజ్లిస్ అభ్యర్థులు గెలుస్తూ వస్తున్నారు. 1999 నుంచి మూడుసార్లు జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో దివంగత అప్సర్‌ఖాన్ వరుస విజయాలతో హ్యాట్రిక్ కొట్టారు. 2014, 2019 ఎన్నికల్లో మజ్లిస్ అభ్యర్థిని మార్చి కౌసర్ మోహియుద్దీన్‌కు టికెట్ ఇచ్చింది. 2019 ఎన్నికల్లో అప్పటి సిట్టింగ్ ఎమ్మెల్యే కౌసర్ సుమారు 48 వేల భారీ మెజార్టీతో విజయం సాధించి కార్వాన్‌లో మజ్లిస్‌ను పటిష్టత రీతిలో చేర్చారు. అయితే పలు సందర్భాల్లో ఆ పార్టీ అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ మజ్లిస్ కొన్ని నియోజకవర్గాల్లో అభ్యర్థులను మారుస్తామంటూ పరోక్షంగా హింట్ ఇచ్చారు. అయితే మజ్లిస్ పార్టీ ఎంతో బలంగా ఉన్న కార్వాన్ నియోజకవర్గంపై ఆయన పెదవి విప్పలేదు. అయితే ఎన్నికల ప్రకటన వెలువడకముందు నుంచే సిట్టింగ్ ఎమ్మెల్యే కౌసర్ చాపకింద నీరులా ఉధృతంగా పర్యటనలు చేస్తున్నారు. 15 రోజులుగా ఎంతో ఉత్సాహంగా ఉదయం నుంచి సాయంత్రం వరకు బస్తీలు, కాలనీల్లో పర్యటనలు చేస్తూ సిట్టింగ్ ఎమ్మెల్యే తనకు ఎదురు లేదని చెప్పుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఎక్కడ కూడా ఎన్నికల ప్రస్తావ తేవకపోవడం గమనార్హం. ఏదేమైనా ఈసారి మజ్లిస్ అధిష్టానం కార్వాన్ అభ్యర్థిని మార్చడం లేదన్నది మాత్రం స్పష్టంగా తెలుస్తోంది.



నార్సింగిలో..

లలితా త్రిపుర సుందరీదేవిగా అమ్మవారు



ఓయూ కాలనీ దుర్గామాత ఆలయంలో..



దుర్గానగర్ ఆలయంలో అమ్మవారి పూజలో పాల్గొన్న ప్రకాష్ గౌడ్



మణికొండ ఓయూ కాలనీ దుర్గామాత ఆలయం లలితా పారాయణంలో..

మణికొండ: దసరా నవరాత్రి ఉత్సవాలలో బాగంగా గురువారం దుర్గాదేవి లలితా త్రిపుర సుందరీదేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల పరిధిలోని మణికొండ, పుప్పాలగూడ, నెక్నాంపూర్, నార్సింగి, మంచిరేవుల, గండిపేట, కోకాపేట, ఖానాపూర్, వట్టినాగులపల్లి, గొలిదొడ్డి గ్రామాలలోని అమ్మవారి మంటపాలు, దేవాలయాలలో ప్రతి రోజు ప్రత్యేక పూజలు, హోమాలు, అన్నదానాలు, పారాయణాలు నిర్వహిస్తున్నారు. మణికొండ ఓయూ కాలనీ దుర్గామాత దేవాలయంలో అమ్మవారి లలితా త్రిపుర సుందరీదేవిగా దర్శనం ఇవ్వగా లలితా పారాయణం నిర్వహించారు. మధ్యాహ్నం పెద్ద ఎత్తున అన్నదానం నిర్వహించారు. నార్సింగిలోని అమ్మవారి మంటపాలలో భజనలు, కీర్తనలు, ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఆయా కార్యక్రమాల్లో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొంటున్నారు.

అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే

మైలార్‌దేవ్‌పల్లి: అమ్మవారి ఆశీస్సులతో రాజేంద్రనగర్ ఎమ్మెల్యేగా గెలువడం ఖాయం అని దుర్గానగర్ అమ్మవారి ఆలయ అర్చకులు ఈశ్వర్ పంతులు తెలిపారు. నవరాత్రి ఉత్సవాలలో భాగంగా మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని దుర్గానగర్‌లోని అమ్మవారి ఆలయాన్ని బీఆర్‌ఎస్ అభ్యర్థి టి ప్రకాష్ గౌడ్ గురువారం దర్శించుకొన్నారు.ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి శాలువాతో సన్మానించారు.



నార్సింగిలో..

బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో...



మణికొండలో బతుకమ్మ ఆడుతున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్



మణికొండలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



బతుకమ్మతో అలకాపూర్ టౌన్‌షిప్‌కు చెందిన రాధిక



శంషాబాద్: పట్టణంలోని సిద్ధాంతి బతుకమ్మ సంబరాలు అంబరాన్నంటాయి.. నార్సింగి మార్కెట్ కమిటీ మాజీ చైర్‌పర్సన్ మంచర్ల మమత శ్రీనివాస్ ఆధ్వర్యంలో భారీ ఎత్తున బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా బస్తీలో మహిళలు బతుకమ్మ ఉత్సవంలో ఆడిపాడారు. కార్యక్రమంలో కో-ఆప్షన్ సభ్యురాలు సంతోష్రప్రభాకర్,జీబీ సుభాష్, చిన్నగండు రాజేందర్, రమేష్, స్టాటిచ్, భాస్కర్, కిషోర్, సుధాకర్; నరేష్, వినోద్, చరణ్, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

మణికొండ: తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలతో పాటు ప్రకృతికి పెద్ద పీట వేసే దసరా పండగను పురస్కరించుకుని మహిళలు పెద్ద ఎత్తున బతుకమ్మ ఉత్సవాల్లో పాల్గొంటున్నారు. మణికొండ మున్సిపాలిటీ కేంద్రంలో బుధవారం రాత్రి పెద్ద ఎత్తున నిర్వహించిన బతుకమ్మ, దాండియా ఉత్సవాల్లో ఎమ్మెల్యే టి. ప్రకాశ్‌గౌడ్, మున్సిపల్ బీఆర్‌ఎస్ ఫ్లోర్ లీడర్ కె. రామకృష్ణారెడ్డిలతో పాటు పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు. గురువారం గండిపేటలోని చైతన్య భారతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(సీబీఐటీ) కళాశాలలో నిర్వహించిన బతుకమ్మ ఉత్సవాలను ప్రిన్సిపాల్ సీవీ నరసింహులు పూజలు చేసి ప్రారంభించారు. అనంతరం మహిళలు బతుకమ్మ ఉత్సవాల్లో ఆడి పాడారు.



సీబీఐటీ కళాశాలలో నిర్వహించిన బతుకమ్మ సంబరాలు



వ్యవసాయ విశ్వవిద్యలయంలో పరిధిలోని వరి పరిశోధన సంస్థలో..